యథేచ్ఛగా కోడిపందేలు



కాళ్ల మండలంలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



ఉండి పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలు, జూదం



పాలకోడేరులో గుండాట ఆడుతున్న దృశ్యం

- జోరుగా పేకాట, గుండాట
- మొదటి రోజు చేతులు మారిన కోట్లాది రూపాయలు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతరు

కాళ్ల: మొదటినుంచి అనుకున్నట్లుగానే కోడి పందేలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి రోజు ఉదయం నుంచే మండలంలోని పలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. మండలంలోని సీసలి, పెదఅమీరం, కాళ్ళ, జక్కరం, ఏలూరుపాడు, కాళ్లకూరు, జువ్వలపాలెం, మాలవాని తిప్ప, బోస్ కాలనీ తదితర గ్రామాల్లో యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట, గుండాటలు జోరుగా సాగాయి. ఈ పందేలులో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పందెం రాయుళ్లు కోడిపందేలు చూసేందుకు పందేలు కాసేందుకు ఎగబడ్డారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన పందేల్లో కాజాలు 2 వేల నుంచి 5 వేల వరకు రేట్లు పలికాయి. కోడి పందేలను తిలకించేందుకు తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానంగా కేసుల గ్రామంలో రాత్రి సమయాల్లో కూడా పందేలు వేసేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

కూటమి ఆధ్వర్యంలో...

భీమవరం అర్బన్: సంక్రాంతికి కోడి పందేలు వేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం అని హుకూం జారీ చేసిన పోలీసులు, తహసీల్దార్లకు కోడిపందెం రాయుళ్ల తమ కోడిపుంజులు ముందు మీరెంతా అన్నట్లు సవాలు చేస్తూ కోడిపందేలు నిర్వహించారు. సోమవారం భోగిని సందర్భంగా మండలంలో భారీగా డేగాపురం, కొవ్వాడ అన్నవరం, చిన్నవిగా యనమదుర్రు,చినఅమిరం, తాడేరు, తుందుర్రు, గ్రామాల్లో కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. పందెరాయుళ్లు తమ కోళ్లతో మధ్యాహ్నం నుంచి పందేం బరులు వద్దకు చేరుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూల నుంచి కోడిపందేలను తిలకించేందుకు రావడంతో భీమవరం పరిసర రోడ్లన్నీ ట్రాఫిక్‌తో నిలిచిపోయాయి. అంతేకాకుండా గుండాట, పేకాట, కోశాటలు నిర్వహించారు. కూటమి నాయకులతో ఆధ్వర్యంలో జరగిన కోడిపందేలలో భారీగా నోట్ల కట్టలు చేతులు మారాయి. గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గుండాట, పేకాట ఇతర జూద కార్యక్రమాలు అనుమతులు ఇవ్వలేదు.

ఉండి: కోడిపందేల నిర్వహణపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. అనుకున్నట్టుగానే పండుగ మూడురోజులపాటు కోడిపందేలు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు. పండుగ మొదటి రోజైన భోగి నాడు సోమవారం ఉండి నియోజకవర్గంలో యథేచ్ఛగా కోడిపందేలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ఉండి, పాములపర్రు, కోలమూరు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడిపందేల మాటున జూద క్రీడలు, మద్యం విక్రయాలు భారీగా సాగాయి. బరుల వద్ద భారీగా గుండాట, కోత ముక్కల ఆట ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చిన వారికోసం బరి వద్ద పలావులు, చికెన్ పకోడి వంటి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పందెంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాలు జాతరను తలపించాయి. స్థానికులతో పాటు ఇతర జిల్లాల నుంచి పలువురు వేలాదిగా తరలివచ్చి పందేలను తిలకించారు.

ఎక్కడికక్కడే బరులు

పాలకోడేరు: హైకోర్టు స్పష్టంగా ఆదేశించినా పోలీసులు పదేపదే హెచ్చరించినా కోడిపందేలు ఆగలేదు. మండలంలో అన్ని గ్రామాల్లో ప్రధాన రహదారుల ప్రక్కన భారీ టెంట్లు వేసి కోడిపందేలను భోగిరోజున ప్రారంభించారు. కోడిపందేలతో పాటు గుండాట, కోతాట జోరుగానే సాగాయి. పలుగ్రామాల్లో కూడళ్ల వద్ద పెద్ద భోగి మంటలు వేశారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత చెరుకువాడ పెదపేట

ఉండి: మండలం చెరుకువాడలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ కప్ టెన్నిస్‌బాల్ టోర్నమెంట్‌ను చెరుకువాడ పెదపేట సీబీఎస్‌సీ యూత్ సభ్యులు గెలుపొందారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో చెరుకువాడ, అర్తమూరు, కలసిపూడి గ్రామాల నుంచి ఆరుజట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన పెదపేట జట్టుకు చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు రూ.12 వేల బహుమతిని అందజేసారు. రెండవస్థానంలో నిలిచిన చెరుకువాడ జెర్సీటీమ్ జట్టుకు రూ.7,500 యిర్రింకి బుజ్జి, మూడవస్థానంలో లిచిన జట్టు నాన్నకుప్రేమతో టీమ్‌కు రూ.5,000 బహుమతిని స్థానిక జనసేన నాయకులు అందజేసారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాంబశివరావు,పాస్టర్ నక్కా జార్జ్‌ముల్లర్ మాట్లాడుతూ పండుగలను పురస్కరించుకుని మంచి మంచి కార్యక్రమాలు నిర్వహించినప్పుడే చాలా వరకు యువత ఆకర్షితులవుతారని అన్నారు. ఈ సందర్భంగా చెరుకువాడ పెదపేట సీబీసీఎస్‌సీ చర్చ్ సంఘ పెద్దలు, స్త్రీల సమాజం జట్టు సభ్యులను అభినందించారు.

యువజనోత్సవాలు ప్రారంభం

ఆకివీడు: పండుగ రోజుల్లో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్‌ఐ తలపెట్టిన సంక్రాంతి యువజనోత్సవాలు మంచి ఫలితాల్ని ఇస్తున్నాయని ఉత్సవ కమిటీ గౌరవధ్యక్షుడు డాక్టర్ పీటీ.ప్రతాప్‌కుమార్ చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం డీవైఎఫ్‌ఐ పోటీల ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ మాట్లాడుతూ చెడు వ్యసనాలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న డీవైఎఫ్‌ఐకి అందరూ సహకరించాలన్నారు. క్రీడలతో దేహదారుఢ్యం, ఆరోగ్యం పొందవచ్చునన్నారు. సంఘ గౌరవధ్యక్షుడు ఎండీ మదనీ, సీపీఎం సీనియర్ నాయకులు బీ.సత్యనారాయణ, వినియోగదారుల సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, పలు క్రీడా ప్రాంగణాల్ని ప్రారంభించారు. తొలుత డీవైఎఫ్‌ఐ పతాకాన్ని గేదల ధనూష్ ఆవిష్కరించారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో జిల్లా స్థాయి పాటల పోటీలు జరిగాయి.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

భీమవరం: అంపశయ్యపై ఉన్న చేనేత రంగానికి ఊపిరి పోసి నేతన్నలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సోమవారం భీమవరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు, వర్క్ షెడ్లు ప్రభుత్వమే నిర్మించాలని, చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని, నేతన్న నేస్తం పథకాన్ని రూ.36 వేలకు పెంచి సొంత మగ్గం ఉన్నవారితో పాటు అద్దె మగ్గాల్లో నేసేవారికి వర్తింపజేయాలని కోరారు. చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి వృత్తి పరికరాలను సబ్సిడీతో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ పీసీ జోషి, చేతి వృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ ఎం.సీతారాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

వీరవాసరం: మండలంలోని పలు గ్రామాలలో సంక్రాంతి పండుగలో భాగంగా మొదటి రోజు సోమవారం ఘనంగా భోగి పండుగ నిర్వహించారు. ప్రతి వీధిలోను కట్టెలు, ఆవు పిడకలతో మంటలు వేశారు. కొన్నిచోట్ల సాంప్రదాయ బద్ధంగా వస్త్రాలు ధరించి భోగి మంటలు చుట్టూ కలియ తిరుగుతూ కోలాటం చేశారు. వీరవాసరం, నవుడూరు జంక్షన్, రాయకుదురు, తోలేరు గ్రామాలలో మహిళలకు రంగవల్లుల పోటీలు, చిన్నారులకు వివిధ వేషధారణ పోటీలు నిర్వహించారు. రాయకుదురులో మహిళలు మహరాణులు గ్రూప్ తరుపున వివేకానంద ట్యూషన్స్‌లో పిల్లలందరికి రకరకాల వేషధారణలు, గొబ్బిళ్లు, భోగి పళ్లు, ఆటల పోటీలు నిర్వహించారు. నవుడూరు జంక్షన్‌లో సంక్రాంతి తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో నదురుపాటి శ్వేత, గన్నమనేడి రాజ్యలక్ష్మి, వల్లూరి వాణి, అరుణ, జయ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



కాళ్ళ లంక ప్రాంతంలో వేస్తున్న భోగిమంట

మండలంలో భోగి వేడుకలు

కాళ్ల: మండలంలో భోగి పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి భోగి పంటలు వేసి సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



ఉండి పడవలరేవులో భోగిమంటలు వేస్తున్న దృశ్యం

ఉండి: సంక్రాంతి పండుగ మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారు జాము నుంచి వీధి వీధిన భోగిమంటలు వేసిన ప్రజలు భోగి పండుగను ఎంతో సాంప్రదాయంగా నిర్వహించుకున్నారు. ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, కోలమూరు, ఉప్పులూరు, యండగండి, చిలుకూరు, మహదేటపట్నం, వాంద్రం తదితర గ్రామాల్లో భోగిమంటలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగిపళ్ల వేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు.

అపూర్వ సమ్మేళనం



కాళ్ల హైస్కూల్లో సమావేశమైన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కాళ్ల: కాళ్ల హైస్కూల్ 1998–99 విద్యా సంవత్సరంలో పదోతరగతి అభ్యసించిన విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 28ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని...నాటి మధుర స్మృతులను స్మరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు పాఠశాల అవరణలో ఉత్సాహంగా గడిపారు. ఇకపై తరుచూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన విద్యార్థులను అభినందించారు.

కనులపండువగా గోదా కల్యాణం



కాళ్ల: స్వామి వారి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం: మెంటేవారి తోటలో గోదాదేవి అమ్మవారికి సారెను తీసుకువెళుతున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భోగి పండుగను పురస్కరించుకుని శ్రీ గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం సోమవారం కనులపండువగా నిర్వహించారు. కాళ్లకూరు వాస్తవ్యులు మద్దాలి తిరుమల వెంకటేశ్వర్లు (బుజ్జి) దంపతులచే శ్రీ స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు వేద పండితులచే వైభవంగా జరిగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారికి సారె అందజేత

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీకోదండ రామాయలంలో గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ధనుర్మాసం సందర్భంగా పట్టణానికి చెందిన చినమిల్లి ఆదినారాయణ దంపతులు 108 రకాల స్వీట్లు, పండ్లు, పూలతో 108 మంది మహిళలతో ఊరేగింపు నిర్వహించి సారె అందించారు.

డీవైఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు

భీమవరం: సంక్రాంతి సందర్భంగా భీమవరం పట్టణం చినరంగనిపాలెంలో డీవైఎఫ్‌ఐ, ఐద్వా మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్లబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యత కోసం ఆటలు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతలో క్రీడా నైపుణ్యం తీసుకురావడం కోసం ఆటలు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విజేతలకు చెల్లబోయిన గోవింద్, ఆకులు వెంకటేశ్వరరావు, అన్నం రాంబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.